

పంటు రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం-సఖినేటిపల్లి మధ్య గోదావరిపై పంటు రాకపోకలను మంగళవారం నిలిపివేశారు. గోదావరికి మళ్లీ వరద ఉధృతి పెరుగుతుండటంతో ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా పంటుపై జనం తరలింపును నిలిపివేయాలని ఆర్‌డిఒ అంబరీష్ పాటదారులను ఆదేశించారు. దీంతో పంటు సేవలు నిలిపివేశారు.



నిలిపివేసిన పంటు



కుక్కునూరు: సీతారామనగరం-వేలేరు రోడ్డుపైకి చేరిన వరద



వేలేరుపాడు మండలంలో పడవలపై పునరావాస కేంద్రాలకు..

గోదావరి ఉగ్రరూపం

ఆందోళనలో విలీన మండలాల ప్రజలు

50 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలింపు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్, కుక్కునూరు రూరల్

గోదావరికి మరోసారి వరద పోటెత్తుతోంది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో మండలంలోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కూనవరం వద్ద గోదావరిలో కలుస్తున్న శబరి నది కూడా ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మండలంపై వరద ప్రభావం కన్పిస్తోంది. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్థానిక అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలైన తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని కోరారు. తిరుమలాపురం నిర్వాసితులను కన్నాయిగుట్ట పునరావాస కేంద్రానికి, తాట్కూరుగొమ్ము ప్రజలను భూదేవిపేటలోని కెజిబివి హాస్టల్‌కు, నాళ్లవరం ప్రజలను నాళ్లవరం కాలనీలోకి, రేపాకగొమ్ము ప్రజలను నెమలిపేట ఆర్‌అండ్ఆర్ కాలనీకి, వేలేరుపాడు మార్కెట్లోని ప్రజలను శివకాశిపురంలోని ఆశ్రమం పాఠశాలలోని పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని ఆదేశించారు.



పోలవరం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

30 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

గోదావరి వరద పోటెత్తడంతో మండలంలో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు నుంచి రుద్రంకోటకు వెళ్లే రహదారి, రేపాకగొమ్ము రహదారులపై నడుములోతు నీళ్లు ప్రవహిస్తుండటంతో రేపాకగొమ్ము ప్రజలు పునరావాస కేంద్రాలకు సైతం పడవలపై వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే మార్గంలో కన్నాయిగుట్టలోని జిల్లేడు చెరువు వద్ద వరద ప్రవాహం చేరడంతో కొత్తూరు, బోళ్లపల్లి, ఎడవల్లి కోయిదా, కట్కూరు తదితర 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కుక్కునూరు రూరల్: గోదావరికి వరద పోటెత్తడంతో మండలంలోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. పది రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే ముంపులోనే ఉంది. మంగళవారం వరద ఉధృతికి మండలంలోని సీతారామనగరం-వేలేరు మధ్య ప్రధాన రహదారి, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై గల కాజ్‌వే నీట మునగడంతో 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఇప్పటికే గొమ్ముగూడేనికి చెందిన 130 కుటుంబాలు ముందుగానే పునరావాస కేంద్రానికి చేరుకోగా వరద పెరుగుతుండటంతో గ్రామంలోని 123 కుటుంబాలు రావికుంట పునరావాస కేంద్రానికి తరలొచ్చాయి. గోదావరికి గంటగంటకు అనూహ్యంగా వరద ఉధృతి పెరుగుతుండటంతో విలీన మండలాల ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. మండలంలో మొక్కదశలో ఉన్న మిర్చి పంట వందల ఎకరాల్లో ముంపునకు గురైంది. గోదావరి వరద మరింత పెరిగితే మండలంలోని కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, బాపన్నగూడెం, లచ్చిగూడెం, కుక్కునూరు-ఎ బ్లాక్ వంటి గ్రామాలు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే వరద ఉధృతి పెరుగుతుండటంతో లోతట్టు గ్రామాల ప్రజలను అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు.

పోలవరం: గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 10,39,627 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32,850 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24,350 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ప్రాజెక్టు ఇఇ మల్లికార్జునరావు తెలిపారు.

గోదావరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం - కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

గోదావరికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇప్పటికే మొదటి హెచ్చరిక జారీ చేశారని, ఎగువ నుంచి వరద నీరు ఎక్కువగా వస్తుండటంతో ధవళేశ్వరం వద్ద రెండో హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో లంక గ్రామాలు, పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప బోట్లపై రాకపోకలు సాగించొద్దని హెచ్చరించారు. జల వనరుల శాఖాధికారులు గోదావరి కరకట్ట బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి ముందస్తుగా పటిష్టపర్చాలని ఆదేశించారు. అవసరమైన ఇసుక బస్తాలు, వెదురు బొంగులు, తడికలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆ ప్రాంత అధికారులను ఆదేశించారు. గర్భిణులు, బాలింతలను ముందుగానే ప్రభుత్వ హాస్పిటల్స్‌కు తరలించాలని తెలిపారు. అవసరమైన లైఫ్ జాకెట్లను, బోట్లను, గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని జిల్లా అగ్నిమాపక అధికారిని ఆదేశించారు.



ఉప్పుటేరుకు పెరిగిన వరద..

ప్రజాశక్తి - ఆకివీడు

వర్షం తగ్గినా ఉప్పుటేరుకు వరద పెరిగింది. బుడమేరు నీరు ఉప్పుటేరు కేసి తిరగడంతో ఇన్ ఫ్లో రెండు రోజులుగా భారీగా పెరిగింది. ఇప్పటికే అధికారులు కిక్కిస కర్ర, గుర్రపుడెక్క చాలా మేరకు తొలగించారు. ఇంకా తొలగింపు కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఈ దశలో నీటి ప్రవాహ వేగం పెరిగింది. అయితే చినకాపవరం డ్రెయిన్ పరిస్థితి మాత్రం దీనికి భిన్నంగా ఉంది. కాలువలోకి వస్తున్న నీటికి అడ్డంకులు పెరిగిపోవడంతో నీరు పక్కదారులు పడుతోంది. కాల్వకు ఒకపక్క ఆక్రమణలు, మరోపక్క మెరక పేరుకుపోవడం కాల్వ ప్రవాహ గతిని మారుస్తున్నాయి. దీంతో ఉప్పుటేరులోకి వెళ్లాల్సిన నీరు కాలువ గట్ల పైనుంచి పొంగిపొర్లుతోంది. ఈ కాలువ ప్రభావంతో అప్పారావుపేట, కోళ్లపర్రు, ఆకివీడు వద్ద పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ఈ క్రమంలో సమతానగర్ నీట మునిగింది. చెంచులకాలనీతో సహా పల్లపు ప్రాంతాలు మొత్తం కనీసం మూడు అడుగుల పైబడి నీటిలో నానుతున్నాయి. ఈ కాలువ ప్రభావంతో సిద్ధాపురం మలుపు వద్ద కాలువ పొంగి నీరు సిద్ధాపురం రోడ్లపైకి చేరింది. వర్షం తగ్గినా వరద పెరగడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు



సమతానగర్‌లో నీట మునిగిన రోడ్లు, ఇళ్లు



తాడేపల్లిగూడెం :ఉధృతంగా ఉన్న ఎర్ర కాలువ

ఎర్ర కాలువ ఉధృతి..

మాధవరం - కంసాలిపాలెం మధ్య నిలిచిన రాకపోకలు

తాడేపల్లిగూడెం: కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎర్ర కాలువకు మళ్లీ వరద పోటెత్తుతోంది. తాడేపల్లిగూడెం రూరల్ మండలంలోని పరివాహక గ్రామాల్లో ఉధృతంగా ప్రవహిస్తోంది. మాధవరం నుంచి నిడదవోలు మండలం కంసాలిపాలెం కాజ్‌వేకు ప్రత్యామ్నాయంగా నిర్మించిన రహదారిపై వరద నీరు ప్రవహించడంతో నాలుగు రోజులుగా రాకపోకలు నిలిపివేశారు. జంగారెడ్డిగూడెం సమీపంలోని కొంగువారిగూడెం వద్ద కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ప్రభావంతో మండలంలోని వీరంపాలెం, పట్టింపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాధపురం, మారంపల్లి, నందమూరు గ్రామాలను ఆనుకుని ఎర్రకాలువ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాడేపల్లిగూడెం తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్ మంగళవారం నందమూరు అక్విడెక్టు వద్ద వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. మంగళవారం మధ్యాహ్నం 30 అడుగులకు చేరుకుందన్నారు. దీంతో ఆయా గ్రామాల రైతులను ప్రజలను అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు. అయితే ఇటీవల ముంపునకు గురైన ఎర్ర కాలువ పరివాహక ప్రాంత రైతులు, ప్రజలు మరలా ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నష్టపోయిన వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. సిపిఎం పూర్తి కాలం కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన కవిటం గ్రామంలో మంగళవారం పరుశరామిరెడ్డి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా భారీ వర్షాల వల్ల లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత ప్రజలను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అన్ని సౌకర్యాలూ కల్పించాలన్నారు. వరద బాధితుల్లో బ్యాంకుల ద్వారా అప్పులు తీసుకున్న రైతులు, కార్మికులు, బాధిత ప్రజలకు ఇఎంఐలు మూడు నెలలు తక్కువ కాకుండా మినహాయింపు ఇచ్చేలా అధికారులు బ్యాంకర్లకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. జిల్లాలో వరద, ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టాలన్నారు. విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా పారిశుధ్యం పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. ముంపు లేకుండా కాలువలను బాగు చేయాలని కోరారు. ఆకివీడు పట్టణంలో తొలగించిన ఇళ్ల బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నేటికీ జిల్లాలో దళిత పేటలకు సరైన శ్మశానవాటికలు లేవన్నారు. తక్షణం ప్రతి దళితపేటకూ జిఒ 1235 ప్రకారం రెండెకరాల భూమిని శ్మశానవాటికకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, డి.కళ్యాణి, చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

బాబాయ్ మృతి తీరని లోటు

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - నరసాపురం

సిఐటియు పట్టణ కార్యదర్శి, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పొన్నాడ రాము (బాబాయ్) (51) మృతి తీరనిలోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. బాబాయ్ సోమవారం గుండెపోటుతో విశాఖపట్నంలో బంధువుల ఇంటి వద్ద మరణించిన సంగతి తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని సోమవారం రాత్రి నరసాపురంలోని స్వగృహానికి తీసుకొచ్చారు. రాము భౌతికకాయాన్ని మంగళవారం బలరాం, రాయ్‌తోపాటు పలువురు నేతలు సందర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాబాయ్ పార్టీ కోసం ఎంతో కషి చేశారన్నారు. ఎన్నో ఉద్యమాల్లో, స్థానిక సమస్యలపై చురుగ్గా పని చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, నేతలు పూరిళ్ల శ్రీనివాస్, పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంఠం, నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు, ఇజ్రాయిల్, బేగం పాల్గొన్నారు.



బాబాయ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గ్రంథాలయాలు విజ్ఞానాలయాలు

నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: గ్రంథాలయాలు విజ్ఞానానికి ఆలయాలు అని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. సంస్థలోని గ్రంథాలయాన్ని ఎక్కువుగా వినియోగించుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బిబ్లియోఫిల్ అవార్డును ప్రకటించారు. దీనిలో భాగంగా 2023-24 సంవత్సరానికి సంబంధించి మంగళవారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కోసం గ్రంథాలయంలో ఎన్నో వేల పుస్తకాలను అందుబాటులో ఉంచామని అన్నారు. మనకి తెలియని ఎన్నో కొత్త కొత్త విషయాలను పుస్తకాల్లో శోధించి తెలుసుకునేందుకు చక్కటి విజ్ఞాన భాండాగారం గ్రంథాలయమన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి ఆరు నెలలకోసారి ఈ బిబ్లియోఫిల్ అవార్డును విద్యార్థులకు అందజేస్తామని వివరించారు. అనంతరం సివిల్ ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సంతోనా నాయక్, బి.జయేష్ గిరీష్‌లకు బిబ్లియోపిల్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ కార్తీక్ శేషాద్రి, గ్రంథాలయ చైర్‌పర్సన్ చేబ్రోలు శ్రీలత, అసిస్టెంట్ లైబ్రేరియన్ కమల మహంతి పాల్గొన్నారు.


ఆ నియామకం సక్రమమేనా..!

భీమవరం సోమేశ్వరస్వామి దేవస్థాన అధికారులపై ఆరోపణల వెల్లువ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా కేంద్రమైన భీమవరంలోని గునుపూడి శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానంలో సాగుతున్న వ్యవహారాలు ఆరోపణలకు తావిస్తున్నాయి. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సైతం కిందిస్థాయి అధికారులకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ఈ దేవస్థానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఇటీవల ఒక వ్యక్తిని నియమించారు. ఈ వ్యక్తి నియమకంపై సర్వత్రా చర్చ సాగుతోంది. గత ప్రభుత్వంలో నాయకుల అండదండలతో అతి చేసిన వ్యక్తికి మళ్లీ ఆలయంలో నియమించడం ఏమిటని అధికార పార్టీకి చెందిన కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే సాక్షాత్తూ ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడు సైతం ఇటీవల విలేకరుల సమావేశంలో దేవస్థాన అధికారుల తీరుపై దుమ్మెత్తి పోశారు. ఈ ఆలయ తాత్కాలిక ఇన్‌ఛార్జి ఇఒ రామకృష్ణంరాజు కంప్యూటర్ ఆపరేటర్ పోస్టును భర్తీ చేసేందుకు ఒక వ్యక్తిని సిఫార్సు చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీనిపై వెనువెంటనే అనుమతులు రావడంతో సదరు వ్యక్తిని విధుల్లోకి తీసేసుకున్నారు. ఇన్‌ఛార్జి హోదాలో ఉన్న ఇఒ నియామక ప్రక్రియ చేపట్టడమే వివాదాస్పదమైతే అదీ ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపి నేరుగా విధుల్లోకి తీసుకోవడం విస్మయం కల్గిస్తుందని పట్టణ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నియామకంలో పెద్దఎత్తున నగదు చేతులు మారినట్లు ప్రచారం సాగుతోంది. గతంలో పని చేసిన ఇఒలెవ్వరూ ఈ పోస్టు భర్తీ అంశాన్ని పట్టించుకోని పరిస్థితుల్లో ఇన్‌ఛార్జి ఇఒ ఏకంగా ఒకరి పేరును సూచిస్తూ ఉన్నతాధికారులకు లేఖ రాయడం పలు అనుమానాలకు తావిస్తోంది.



నియామక ప్రక్రియ నిబంధనల అమలేదీ

వాస్తనంగా ప్రభుత్వ పరిధిలో నడిచే కార్యాలయాలు, సంస్థలు, ఇతరత్రా వాటిలో సిబ్బందిని నియమించాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. ముందస్తుగా ఉన్నతాధికారుల అనుమతి పొంది దాని ఆధారంగా నియామక నోటీఫికేషన్ విడుదల చేసి అందరికీ తెలిసేలా ప్రచారం సైతం సాగించాలి. అనంతరం దరఖాస్తులు స్వీకరించి వారిలో అర్హతున్న వారిని ఎంపిక చేసి ప్రాధాన్యతాక్రమంలో నియమించాల్సి ఉంది. అయితే దేవస్థానం కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు భర్తీలో ఈ ప్రక్రియ ఏమీ చేపట్టకపోవడం వెనుక వేరే తతంగం జరిగిందనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. దేవస్థానంలో కంప్యూటర్ ఆపరేటర్ నియమాకం విషయంలో ఉన్నతాధికారులు సైతం స్థానిక ఇన్‌ఛార్జి ఇఒకు పూర్తిగా సహాయ సహకారాలు అందించినట్లు తెలుస్తోంది. సదరు వ్యక్తి (కంప్యూటర్ ఆపరేటర్) ఏడేళ్లుగా సంబంధిత శాఖలో చక్రం తిప్పుతూ ఉన్నత స్థాయి వరకు పరిచయాలు పెంచుకుని ఇఒలు, కిందస్థాయి ఉద్యోగులకు అవసరమైన పనులు చక్కపెడుతుండటంతో స్వామి భక్తిగా ఈ పోస్టులో నియమించినట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

అకారణంగా స్వీపర్ తొలగింపు..!

స్థానిక దేవస్థానంలో పనిచేస్తున్న స్వీపర్‌ను కొద్ది రోజుల క్రితం తొలగించారు. వాస్తవంగా ఎవరినైనా తొలగించాలంటే ముందస్తుగా వివరణ కోరాలి. అయితే అటువంటిదేమీ లేకుండా కొందరి మాటలను ఆసరా చేసుకుని తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అదుపుతప్పిన చైతన్య కళాశాల బస్సు

తప్పిన పెను ప్రమాదం

ఏడుగురు విద్యార్థులకు గాయాలు

డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమంటున్న స్థానికులు, విద్యార్థులు

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరం శ్రీచైతన్య విద్యాసంస్థలకు సంబంధించిన కళాశాల బస్సు మంగళవారం అదుపుతప్పి తోటలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఏడుగురు విద్యార్థులు గాయాల పాలయ్యారు. దీంతో భీమవరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి విద్యార్థులను తరలించారు. అయితే ఎవరికి ఇటువంటి ప్రాణాపాయస్థితి లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు ప్రకటించారు. అయితే డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని విద్యార్థులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కళాశాల యాజమాన్యం, బస్సు డ్రైవర్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బస్సులు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నాయని విమర్శించారు. బస్సులకు సరైన ఫిట్నెస్ లేకపోవడం, కాలం మళ్లిన వాహనాలను నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం కేవలం నామమాత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని బస్సులకు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా వెల్లి వెతుతున్నాయి. ఫలితంగా తరచూ పాఠశాలలు, కళాశాలల బస్సులు ప్రమాదాలకు గురి అవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. పాలకోడేరు-మొగోళ్లు రహదారిలో మంగళవారం చోటు చేసుకున్న బస్సు ప్రమాదం అందర్నీ భయభ్రాంతులకు గురిచేసింది. కోరుకొల్లు, మొగోళ్లకు చెందిన సుమారు 20 మంది విద్యార్థులు భీమవరం శ్రీచైతన్య కళాశాలలో చదువుతున్నారు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం కళాశాలకు చెందిన బస్సులో విద్యార్థులు బయలుదేరారు. అయితే బస్సు పాలకోడేరు శివారుకు వచ్చేసరికి అదుపుతప్పి స్థానికంగా ఉన్న బెండకాయల తోటలోకి దూసుకుపోయి మట్టిలో దిగబడిపోయింది. విద్యార్థులు బస్సులో చెల్లాచెదురుగా పడిపోయారు. బస్సు సీట్లు, బ్యాగులు, భోజనం సంచులు సైతం విద్యార్థులపై పడడంతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ ఘటంలో ఏడు మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఒక విద్యార్థి తలకు బలంగా గాయమైంది. మరో విద్యార్థికి నాభిపై, మరో విద్యార్థికి చేతులు, కాళ్లపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఏం చేయాలో తెలియక విద్యార్థులు పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారంతా సంఘటనా స్థలానికి పరుగులు తీశారు. బస్సులో ఉన్న విద్యార్థులను కిందకు దింపి పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అక్కడ విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరంలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులు అక్కడ చికిత్స పొందుతున్నారు. ఎవరికి ఎటువంటి ప్రాణాపాయస్థితి లేదని, విద్యార్థుల ఆరోగ్యాలు కూడా నిలకడగానే ఉన్నాయని వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు పోలీసులు వెల్లడించారు.



విద్యార్థులను తీసుకెళ్తున్న గ్రామస్తులు



అదుపుతప్పి కళాశాల బస్సు

అతివేగమే ప్రమాదానికి కారణం

డ్రైవర్ అతివేగంగా బస్సును నడపడమే ప్రమాదానికి కారణమని విద్యార్థులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకోడేరు-మాగల్లు రోడ్డు గోస్తాని డ్రెయిన్ ఆనుకొని ఉంటుంది. ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు, వందలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తూ రద్దీగా ఉంటుంది. దీనికి తోడు ఈ రహదారి ఇరుకుగా ఉండటమే కాకుండా ఇటీవల వచ్చిన వరదలకు కోతకు గురికావడం జరిగింది. ఈ నేపథ్యంలో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించుకునే పరిస్థితి ఉండదు. అయితే ఇటువంటి రహదారిపై బస్సును జాగ్రత్తగా నడపాల్సిన డ్రైవర్ అతివేగంగా బస్సును నడపడంతో బస్సు అదుపు తప్పిందని స్థానికులు, విద్యార్థులు చెబుతున్నారు. గతంలో డ్రైవర్‌ను మందలించినప్పటికీ పరిస్థితి మార్చుకోలేదని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా కనీసం పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

కన్నీరు మున్నీరైన విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రమాద సంఘటన ప్రాంతంలో గాయాలు పాలైన విద్యార్థులను చూసి విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలకు జరగరానిది ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అంటూ నిలదీశారు. కళాశాల యాజమాన్యానికి చెప్పినా కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ పిల్లలకు భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులకు ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో


పెనుమంట్రలో..

జిఒ 85ని వ్యతిరేకిస్తూ వైద్యుల నిరసన

నల్లరిబ్బన్‌లతో విధులకు హాజరు

ప్రజాశక్తి - గణపవరం

జిఒ 85ని వ్యతేరేకిస్తూ మంగళవారం గణపవరం, పిప్పరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు నల్లరిబ్బన్‌లతో విధులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్ల అసోషియేషన్ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకి హాజరైయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సంతోష్, పి.కిరణ్మయి, కె.ప్రియాంక మాట్లాడుతూ జిఒ 85 వల్ల తమకి మూడు సంవత్సరాల సర్వీసు అర్థంలేకుండా పోతుందని అన్నారు. ప్రభుత్వం అకస్మాత్తుగా జిఒని మార్చడం అన్యాయమని తెలిపారు. దీని వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్రంగా నష్టం కలుగుతుందని అన్నారు. జిఒ రద్దు చేయాలని గత రెండు నెలలుగా అధికారులకు, ఎంఎల్ఎలకు వినతి అందించినప్పటికి ఇంతవరకు అధికారుల వద్ద నుంచి ఎటువంటి సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కోవిడ్ సమయంలో తమ జీవితాలను ప్రమాదంలో పెట్టి సేవలందించామని, ఈవిషయం అధికారులు మరిచిపోయారని అన్నారు. జిఒ 85 ద్వారా పిజి అవకాశాలు తగ్గించటం వల్ల గ్రామీణా, గిరిజన ప్రాంతాల్లో సేవలు ప్రభావితం చేస్తుందని అన్నారు.

పెనుమంట్ర : ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(ఎపిపిహెచ్‌డి) వైద్యులు జిఒ 85కి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ పి.కనకప్రియ నల్ల బ్యాడ్జిలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఈ జిఒ వల్ల తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందని, ఇలా అకస్మాత్తుగా జిఒను మార్చడం అన్యాయమని, తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు. గత రెండు నెలలుగా జిఒ 85 రద్దు చేయమని అందరు అధికారులకు, ఎంఎల్ఎలకు అర్జీలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి సమాధానం రాలేదని వైద్యులు నిరాశ వ్యక్తం చేశారు. కోవిడ్ -19 సమయంలో మా జీవితాలను ప్రమాదంలో పెట్టి సేవలు అందించినప్పటికీ, ఇప్పుడు జిఒ 85 ద్వారా పిజి అవకాశాలు తగ్గించడం అన్యాయమని, ఇది ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాశిపాడు ఆరోగ్య ఉప కేంద్రం ఆరోగ్య సహాయకులు నామాలరాజు అన్నారు. మంగళవారం సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించి, దోమల నివారణకు కృషి చేయాలని కోరారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని అన్నారు. దోమలను నివారిస్తే వ్యాధులు దరిచేరవని తెలిపారు. ప్రస్తుతం కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఎవరికైనా చలిజ్వరం, తలపోటు, దగ్గు ఉంటే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త మేరి గోల్డ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఎయిర్ స్ట్రిప్ మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో 70 మంది వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులను దైవంతో సమానంగా చూడాలని, వారిపట్ల నిర్లక్ష్య వైఖరి వహించవద్దని, పేద వృద్ధులకు సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అరుణ కుమారి, హరిణి, సతీష్ పాల్గొన్నారు.

పలుచోట్ల అన్న సమారాధన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గణేష్ నవరాత్రుల భాగంగా పట్టణంలో పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రెండవ పట్టణంలోని చిన్న మావుళ్లమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం దీనిలో భాగంగా అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ అన్న సమారాధనకు భీమవరం పట్టణంలోని అన్ని ప్రాంతాల నుంచి సుమారు 8 వేల మందికి పైగా యాత్రికులు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారని ఆలయ కమిటీ చైర్మన్ రేవూరి గోగురాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టిన గ్యాంగ్ వర్క్, జంగిల్ క్లియరెన్స్ పనులను మంగళవారం నరసాపురం ఛైర్‌పర్సన్ బర్రి వెంకట రమణ పరిశీలించారు. పట్టణంలోని స్టీమర్ రోడ్డు, పంటి రేవు, బాపు ఘాట్, వైఎన్.కళాశాల రోడ్లు పనులు స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను అధికారులను ఆదేశించారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రతి కార్యకర్తకు అన్ని విధాల అండగా ఉంటానని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు తెలిపారు. మంగళవారం పోడూరు మండలం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి తరుపున పనిచేసిన ప్రతిఒక్కరికి అండగా ఉంటానన్నారు. గత ప్రభుత్వకాలంలో ఎక్కడా కక్ష సాధింపు చర్యలు పాల్పడలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంట పొలాల అంచనాలు తయారు చేయాలి

జెసి రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం : భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను అంచనాలు వేసి సత్వరమే నివేదిక అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం చినఅమిరం, ఎల్విఎన్.పురం గ్రామాలలో ఆయన పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటమునిగి దెబ్బతిన్న వరిపొలాలను సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. జరిగిన పంట నష్టాలను, ప్రభుత్వం అందించిన ఫార్మెట్‌లో పూర్తి సమాచారాన్ని పొందుపరిచి నివేదికను జిల్లా కార్యాలయానికి అందించాలన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి ప్రక్రియలో భాగస్వాములై క్షేత్రస్థాయిలోకి రైతులతో కలిసి వెళ్లి డేటా కాలం 34లో నమోదు చేసి నివేదికను అందించాలన్నారు. నష్టాలు అంచనాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా కచ్చితంగా అంచనాలను తయారు చేయాలని ఆదేశించారు.

డ్రెయిన్లు పరిశీలించిన జెసి

ఎల్విఎన్ పురం వద్ద ఉండి డ్రెయిన్, ఓల్డ్ యనమదుర్రు డ్రెయిన్లను జెసి పరిశీలించారు. పల్లిపాలెం బ్రిడ్జి వద్ద కిక్కిస ప్రాంతాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు. యనమదుర్రు డ్రెయిన్ వరద ఉధృతికి మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని, రెండవ ప్రమాద హెచ్చరిక జారీ కాకముందే యుద్ధ ప్రాతిపదిక ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కిక్కిస తొలగింపు, డ్రెయిన్ పూడిక పనుల ప్రతిపాదనలను సమర్పణ అందించాలని ఆదేశించారు. జెసి వెంట తహశీల్దార్ రావి రాంబాబు, వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాస్, ఎడి ఎవి.శ్రీనివాస్, జలవనరుల శాఖ సహాయక ఇంజనీర్ ఎవి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బడులా.. నీటి మడులా..!

ప్రజాశక్తి - ఆచంట

చినుకు పడితే చాలు బడుల ఆవరణలు, మైదానాలు, వరి సాగుకు ముందు నీటితో నింపే మడులను దర్శనమిస్తున్నాయి. పల్లంగా ఉండటంతో కనీసం పాఠశాలలోకి వెళ్లే అవకాశం లేకుండా నిండిపోతున్నాయి. చదువుకోవాలంటే చిన్నారులు, ఉద్యోగం చేయాలంటే ఉపాధ్యాయులు ఆ నీటిలో అడుగు వేయాలసిందే. లోపలికి వెళ్లాలికి బయటకు వచ్చే మార్గం కూడా ఉండటం లేదు. పల్లంగా ఉన్న పాఠశాలల ఆవరణలు, మైదానాలు ఉపాధి హామీ చట్టం ద్వారా అభివృద్ధి చేసుకునే వీలున్నా వేసవికాలం అంతా ఊరుకున్నారు. అప్పటి అధికారుల నిర్లక్ష్యం ఇప్పుడు చిన్నారుల పాలిట శాపంగా మారింది.

వానొస్తే.. పాఠశాల ఆవరణ చిత్తడి చిత్తడే
ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆ నీటిలోంచే లోపలికి వెళ్లాలి
ఉపాధి హామీ పనుల ద్వారా పరిష్కరించే అవకాశమున్నా పట్టించుకోని అధికారులు

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చిన్నం పేట మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ముంపునకు గురైంది. ఆ పాఠశాల ఆవరణంలో వర్షం నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు నానా ఇక్కట్లు పడుతున్నారు. వర్షం కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో ఆ పాఠశాల విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రతిరోజు వర్షపు నీటిలోనే పాఠశాలకు వెళ్లి రావాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల ఆవరణలోని వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో చినుకుపడిన ప్రతిసారి విద్యార్థులకు పీట్లు, పాట్లు తప్పడం లేదు. ఈ సేవర్షంలో తాము ఆటలకు దూరంగా ఉండవలసి వస్తుందని వాపోతున్నారు. భారత జనాభాలో 35 శాతం 15 ఏళ్లకు లోబడిన వారే, నిధులు, అనేక కారణాల రీత్యా ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడం లేదన్నది కఠోర వాస్తవం. ప్రభుత్వం విద్యారంగానికి తమ కేటాయింపుల్లోన్ని ఆరు శాతానికి పెంచుతామని ఏళ్లుగా చెబుతూ వస్తున్నాయి. కానీ నేటికీ ఆ కేటాయింపులు 3.5 శాతానికే మాత్రమే పరిమితమై ఉన్నాయి. విద్యరంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లది రూపాయల నిధులను కేటాయిస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో ఆ నిధులను కొందరు స్వాహా చేస్తున్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యా విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

తక్కువ ఖర్చుతో పోషకాహారం పొందాలి

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణకుమారి

ప్రజాశక్తి - పెనుమంట్ర

తక్కువ వ్యయంతో చక్కటి పౌష్టికాహారం ఇంట్లో తయారుచేసుకొని, ఆరోగ్యం పొందవచ్చని ఐసిడిఎస్ పెనుమంట్ర ప్రాజెక్ట్ అధికారిణి అంగర కృష్ణకుమారి అన్నారు. మండలంలోని మల్లిపూడి, కొయ్యేటిపాడు, బ్రాహ్మణచెరువు 2 అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించడంతో పాటు తల్లులకు, గర్భిణులకు వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కేంద్రాల ప్రతినిధులు, ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు ఎస్.వెంకటలక్ష్మి, టి.పోశమ్మ, పి.వరలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.


సిఐకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామరాజు

సిఐను కలిసిన రామరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల నరసాపురం పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన బి.యాదగిరిని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మంగళవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సిఐకు అభినందనలు తెలిపిన రామరాజు నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి పాల్గొన్నారు.

రూపాయికే బిర్యానీ..

బారులు తీరిన జనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రూపాయికే బిర్యాని అనడంతో ప్రజలు ఎగబడ్డారు. ఈ ఘటన మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో చోటు చేసుకుంది. ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఫుడ్ ఫారెస్ట్ రెస్టారెంట్ పాత రూపాయి నోటుకి బిర్యాని అని ప్రకటించి ఫ్లెక్సీ ఏర్పాటు చేసింది. అయితే ఈ ఆఫర్ మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల మధ్య పెట్టారు. దీంతో హోటల్ వద్ద పాత రూపాయి నోటుతో జనం బారులు తీరారు. దీంతో క్యూ రోడ్డుపైకి రావడంతో కొద్ది సేపు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగింది.

విజయవాడకు తరలిన పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - నరసాపురం

విజయవాడ వరద ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు నరసాపురం మున్సిపాలిటీ నుంచి సిబ్బంది వెళ్లినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. నరసాపురం పురపాలక సంఘం నుంచి 20 మంది పారిశుధ్య కార్మికులు, నలుగురు శానిటరీ సెక్రటరీలు, సిబ్బందిని బస్సులో పంపించామన్నారు. మున్సిపాలిటీ నుంచి సెప్టిక్ ట్యాంక్ వాహనాన్ని పంపించినట్లు కమీషనర్ తెలిపారు.

నష్ట నివారణకు అధికారులు కృషిచేయాలి

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

అధిక వర్షాలతో నష్టపోతున్న రైతులకు, నష్ట నివారణకు అధికారులు కృషిచేయాలని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మంగళవారం నరసాపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో, వ్యవసాయ శాఖ ఎడి అనిల్ కుమారి ఆధ్వర్యంలో నరసాపురం మండలంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో ఆయా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ, మత్స్యశాఖ అధికారులు వారు నిర్వహిస్తున్న విధులు, వారు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేసే విధానాలను తెలుసుకుని వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో వ్యవసాయ రైతులు పూర్తిగా నష్టపోయారని, అయితే ప్రకృతి విపత్తులను ఆపలేమని, కానీ వాటి వల్ల కలిగే నష్టాన్ని నివారించవచ్చని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాలతో పంట నీట మునిగిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం త్వరలోనే అందజేయనుందని ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోని, నరసాపురం సబ్ డివిజనల్ వ్యవసాయ శాఖ ఎడి అనిల్ కుమారి పాల్గొన్నారు.

ఫెర్రీ ఆదాయం అందించాలని వినతి

నరసాపురం: మాధవాయిపాలెం ఫెర్రీ ఆదాయంలో 25 శాతం వాటా మున్సిపాలిటీకి చెందేలా చర్యలు చేపట్టాలని నరసాపురం మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నరసాపురం ఆర్‌డిఒ ఎం.అత్యుత్ అంబరీష్‌ను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రేవు ఆదాయం మొత్తం మండలపరిషత్‌కు వెళుతుందని ఆర్‌డిఒకు వివరించారు. రేవు వద్ద నిర్వహణ బాధ్యతలు అన్నీ మున్సిపాలిటీనే చూస్తుందని చెప్పారు. కాన్సిలర్లు కామన బుజ్జి, బర్రి జయరాజు, కావలి నాని, కేసరి గంగరాజు, సఖినేటిపల్లి సురేష్ పాల్గొన్నారు.


వినతినందిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

జీవితంలో గెలిచేందుకు కృషి చేయాలి


ప్రజాశక్తి - ఉండి

ప్రతి మనిషి జీవితంలో గెలిచేందుకు కృషి చేయాలని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పూనుకోకూడదని భీమవరం కోర్టు పిఎల్‌వి పాలూరి బాలాజి అన్నారు. స్థానిక పెనుయేలు చర్చి ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినోత్సవం పురస్కరించుకొని భీమవరం కోర్టు పిఎల్ వి.పాలూరి బాలాజీ మాట్లాడుతూ మనిషి పుట్టుక, చావు అన్ని సహజంగా జరుగుతాయని, కానీ కొంతమంది ముఖ్యంగా యువత జీవితాన్ని అర్థాంతరంగా ముగిస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు తిట్టడం, పరీక్షల్లో ఫెయిల్ అవడం, ప్రేమ విఫలం అవ్వడం వంటివి యువత జయించాలని, జీవితం చాలా చిన్నదని, 20 సంవత్సరాల వరకు బాల్యంలో గడిపినట్లుగా ఉంటుందని, తర్వాత మూడు పదులు దాటితే బాధ్యతలు వస్తాయన్నారు. చిన్న చిన్న విషయాలకి కుటుంబంలో కలహాలు పెట్టుకొని, భార్యాభర్తలు గొడవలు పడి, క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవడం వల్ల వారికి పుట్టిన పిల్లలు జీవితాంతం అనాథలుగా

పాలూరి బాలాజీ

ఉంటారని, వారి జీవితంలో తల్లి లేదా తండ్రి లేని లోటు ఎవరు తీర్చలేరని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా జీవితంలో ఎన్నో ఎత్తు, పల్లాలు ఉంటాయని, అన్ని సరిచేసుకుంటూ ముందుకు సాగాలని, మనం బ్రతికి పది మందిని బ్రతికించాలని సూచించారు. ఆత్మహత్య అనేది ఒక పిరికిపంద చర్య అని మిమర్శించారు. ఈరోజు ఎంతోమంది డిప్రెషన్‌లో ఉన్నారని, అలాంటి వారిని చుట్టూ ఉన్నవారు గమనించాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు చిన్నపిల్లలను, యువతను జాగ్రత్తగా గమనించి డిప్రెషన్లో ఉంటే సైకాలజిస్ట్ సలహాలు తీసుకోవాలని అన్నారు. 2003వ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామని పాలూరు బాలాజి తెలిపారు. ఈ కార్యక్రమంలో బొర్రా రెడ్డి, గంధం సూరిబాబు, దమ్ము యువరాజు, పాలూరి తిమోతి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమాలు


పాలకోడేరు : ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

తెలంగాణ భూపోరాట వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట పటిమను రజకులందురు ఆదర్శంగా తీసుకుని, జాతిహక్కుల కోసం ఉద్యమించాలని రజక సంఘం రాష్ట్ర నాయకులు యండమూరి సుబ్బారావు అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురష్కరించుకుని వీరవాసరం మండల రజకసంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి, జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకోడేటి లక్ష్మణరావు, సహదేవుడు, సన్యాసిరావులు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం పోరాటం సాగించింది వీరనారి చాకలి ఐలమ్మ అని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు యండమూరి నాగేంద్ర అన్నారు. చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని వేల్పూరు రజకపేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ, రామకృష్ణల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు మాట్లాడుతూ అణచివేతకు గురైన రైతులను, వ్యవసాయ కూలీలను ఒక్కటిగా చేసి భూమికోసం, భుక్తి కోసం, కూలీ కోసం రాజకర్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరపు నరసింహమూర్తి, మీసాల రాము, పొలమూరి శివ, నాగకుమార్ పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరులో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొగల్లు రజక భవనంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి ఆ గ్రామ సంఘ అధ్యక్షులు జైను బాలరాజు, ములపర్తి వెంకటస్వామి, దొడ్డపట్ల అమ్మరావు, చిటికెల్లి సురేష్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుమధవల్లిలో జరిగిన వేడుకల్లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు అమ్మవారు, మల్లిపూడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. మండలంలో ఏ గ్రామంలోనైనా రజకులపై దాడులు, దౌర్జన్యాలు జరిగితే ఐలమ్మ చూస్తూ ఊరుకోకుండా హక్కుల కోసం పోరాటం చేసేదని గుర్తుచేశారు. ఐలమ్మ చేసిన త్యాగాలు మరువలేనివని, ఆమె అడుగుజాడల్లో నడిచి ఆమె ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యండమూరి పెద్ద దానయ్య, చిన్నదానయ్య, అంజివృత్తి చెన్నారావు, వనపర్తి మూర్తి, ఉప్పలపాడు వెంకటేశ్వరరావు, పాలకోడేరు శ్రీనివాసరావు, భీమవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి శాస్త్రవేత్తలు పాటుపడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

రైతులకు మేలైన లాభసాటి వరి వంగడాలను అందించి, వారి అభివృద్ధికి కెవికె శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంను కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించారు. ఈ సందర్భంగా సైంటిస్టులతో సమావేశమై కృషి విజ్ఞాన కేంద్రంలో కొనసాగుతున్న పరిశోధనలపై ఆరా తీశారు. పరిశోధనలను విస్తృతం చేసి రైతులకు మేలైన వరి, ఫ్లోరికల్చర్, హార్టికల్చర్ వంగడాలను అందించాలన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా పంట పొలాల్లో, ఉద్యానవన తోటల్లో నీళ్లు నిలబడిపోవడం జరిగిందని, నీళ్లు తొలగిన అనంతరం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే చిరుధాన్యాల సాగు, అంతర పంటల సాగుపై రైతులలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కిచెన్ గార్డెన్స్, టెర్రస్ గార్డెన్స్‌కు అనువైన మొక్కలను అందించాలన్నారు. పంటల సాగులో డ్రోన్ల వినియోగం పెరగాలని, పురుగుమందులు స్ప్రేయింగ్‌కు డ్రోన్‌లను వినియోగించాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో స్ప్రేయింగ్ చేయడంతో పాటు, పురుగు మందులు కూడా ఆదా అవుతాయని తెలిపారు. డ్రోన్ల వినియోగంపై శిక్షణ అందించడానికి తొలి విడతలో 100 మందిని గుర్తించాలని డిఆర్‌డిఎ పిడికి సూచించారు. జిల్లాలో ఇప్పటికే ఆరు డ్రోన్లను మహిళా సభ్యులకు అందజేయడం జరిగిందని, వాటిని వెంటనే వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. కషి విజ్ఞాన కేంద్రంలో వివిధ వంగడాలపై పరిశోధనలు చేసి గుర్తించిన మొక్కలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి శాస్త్రవేత్తలను అడిగి వివరాలను తెలుసుకున్నారు. కెవికె సందర్శనలో కెవికె శాస్త్రవేత్తలు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, ఫిషరీస్ రీసెర్చ్ హెడ్ డాక్టర్ చంద్రశేఖర రావు, కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ ఎన్.దేబోరా మెసియాన, ఫిషరీస్ డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, క్రాప్ ప్రొడక్షన్ డాక్టర్ పి.వినయ లక్ష్మి ఉన్నారు.

దాతల సహకారం మరువలేను : కలెక్టర్

భీమవరం : విజయవాడ వరద బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్న దాతల సహకారం మరువలేనని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో పెద్ద అమిరంకు చెందిన మహేశ్వరి గ్రూప్స్ అండ్ మహేశ్వరి ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ కలిదిండి మురళీకృష్ణంరాజు విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ నాగరాణికి అందజేశారు. అలాగే ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఉన్న నరేష్ ఎగ్జిక్యూటివ్ బాయ్స్ హాస్టల్ యజమాని కొప్పినేని నరేష్ రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతా అన్నపూర్ణగా పేరుగాంచిన పశ్చిమగోదావరి జిల్లా నేడు వరద బాధితులకు ఆపన్న హస్తం అందించడంలో ముందు వరుసలో ఉందని కొనియాడారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

భీమవరం : రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రాయలం గ్రామంలో నెం.54 రేషన్ షాపును, నిత్యవసర వస్తువులను డోర్ డెలివరీ చేస్తున్న(ఎండియు) వాహనాన్ని జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ చేస్తున్న ఎండియు వాహనంలో, చౌక ధరల దుకాణంలో రికార్డుల ప్రకారం ఉండవలసిన స్టాక్‌ను, ఇ పాస్‌తో స్టాకు నిల్వలను తనిఖీ చేసి అదనంగా వున్న పంచదార నిల్వ తేడాను గమనించి, ఎండియు వాహన ఆపరేటర్, షాపు నిర్వాహకుడుపై కేసు నమోదుకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ రావి రాంబాబును ఆదేశించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతినెల పేదలకు ఎండియు వాహనముల ద్వారా పంపిణీ చేసే సరుకులలో అవకతవకలు జరిగితే ప్రభుత్వ నిబంధనల మేరకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహశీల్దారు రావి రాంబాబు, విఆర్ఒ, సివిల్ సప్లై శాఖ సిబ్బంది వున్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రతి ఎంఎల్ఎ బాధితులకు న్యాయం జరిగే వరకూ తోడుగా ఉంటామని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయవాడలోని పాయకాపురం ప్రాంతంలో వరద బాధితులకు ఇంటింటికి వెళ్లి వరద విపత్తు వల్ల ఇంటిలో ఉన్న, పాడైపోయిన వస్తువుల గురించి తెలుసుకొని, మిమ్మల్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, ధైర్యం కోల్పోవద్దని అన్నారు. అనంతరం నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమాలను మంగళవారం దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు బాధితులందరికీ అండగా ఉండేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని, వారి సూచనలకు అనుగుణంగానే ప్రజాప్రతినిధులు అంతా పనిచేస్తున్నామన్నారు. బాధితులకు ఆపద వచ్చినప్పుడు సాయం చేయడంతో పాటు మేమున్నామన్న ధైర్యం కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

ఆచంట: గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక పక్క వర్షాలు, మరో పక్క గోదావరి వరద నేపథ్యంలో అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరికి మంచినీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

నరసాపురం: ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మాధవాయి పాలెం పంటి రేవును, పొన్నపల్లి ఏటిగట్టును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుంతుందని ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు. భద్రాచలం వద్ద పెరుగుతున్న వరద నేపథ్యంలో మంగళవారం నరసాపురం-సఖినేటిపల్లి మధ్య పంటి సేవలను నిలిపివేశారు. అకస్మాత్తుగా పెరుగుతున్న వరద నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకున్నారు. మంగళవారం ఉదయం పాఠశాలలకు, కళాశాలలకు తూర్పుగోదావరి నుంచి నరసాపురం వచ్చిన విద్యార్థులకు తిరుగు ప్రయాణంలో అసౌకర్యం ఎదురుకాకుండా ఎంఎల్ఎ ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, ఎంఆర్ఒ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

ఉరకలేస్తూ పెరుగుతున్న వశిష్ట గోదావరి

పెనుగొండ: అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో పెనుగొండ మండలం, సిద్ధాంతం వశిష్ట గోదావరి వద్ద గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుంది. మంగళవారం దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి, చినమల్లం లంక భూములను తాకుతూ నిండుగా గోదావరి ప్రవహిస్తుంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నారు. గత రెండు రోజుల నుంచి ఆరడుగుల వరకు వరద పెరిగిందని అంచనా వేస్తున్నారు. మంగళవారం పెనుగొండ ఎంఆర్ఒ జి.అనిత కుమారి సిద్ధాంతం వశిష్ట గోదావరి మధ్యస్థ లంకలోకి వెళ్లి లంక భూములను పరిశీలించారు. వరద నీరు పెరిగే అవకాశం ఉన్నందున మధ్యస్థ లంకలో కూరగాయల రైతులు, పాడి రైతులకు పలు సూచనలు చేశారు. తహశీల్దార్ వెంట ఆర్ఐ కిరణ్ కుమార్ ఉన్నారు.

గుడిలో చోరీ

పెనుగొండ: నాగేశ్వరి మహర్షి వర్ధన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వెంకటేశ్వర స్వామి గుడి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి చొరబడ్డారు. సోమవారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుందని ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తెలిపారు. అడిషనల్ డిఎస్‌పి ఎన్‌బిఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు నాలుగు కేజీలు వెండి వస్తువులు, రెండున్నర కాసుల బంగారం వస్తువులు పోయినవని వీటి విలువ రూ.లక్ష 50 వేలుగా గుర్తించామని ఆలయ ఇఒ రామ్ పెద్దింట్లు, సిఐ రజనీ కుమార్, ఎస్ఐ గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.